# పల్లవి

అవాళ ప్రొద్దున్నే, నిదుర లేచీ లేవడంతోనే, యింటి ఆవిడతో నాకు పెద్ద పోట్లాటైంది.

పోట్లాడింది. నేనుకాదు – ఆ ముసలమ్మే, ఊరికే తగని మొగం – కండలు చించుకుంది.

"అమ్మా, నేను చేసినదాంట్లో పొరబాటేమన్నా ఉంటే, మన్నించండి. మీరు పెద్దలు, తల్లి వంటివారు..." అని చాలా వినయంగా, నెమ్మదిగా వంచిన తల యెత్తకుండా జవాబు చెప్పాను.

అంతటితో ఆవిడ మరీ మంటలు పెట్టింది. భగ–భగ లాడిపోయింది. మొగంమీద ఏమీ అనకుండా రుంజుకుంటూ, వరాలక్కలాగా చక్కాబోయింది. వాళ్ళగుమ్మంలో నిలుచుని, పిల్లిమీదా, ఎలికమీదా పెట్టి, అక్షులూ పక్షులూ హడలేట్టు దుమ్మెత్తి పోసింది.

"...తిట్టినా, దిమ్మెత్తినా ఇంత రోషంలేని, ఈ వెధవ మేళాం ఎక్కడ పోగయిందర్రా నాకూఁ? దిక్కుమాలిన సజ్జు! తల్లివంటి దాన్నిట పైగా? తల్లీ దగబోలూను! వీడే నాకొడుకైతె, నట్టేట్లో లోతుగా చూసుకుని, గొంతుక్కు బండరాయి కట్టుకుని హొరీమని ఉందును...వీళ్ళ మొగమీడ్చా, కడుపులు చెడబుడతారు..." ఆదయః...

నాకు కోపంరాలేదు. వింటూన్న కొద్దీ సంబరం వేసింది. వీళ్ళయిల్లు బంగారంగానూ, కాకినాడ పరగణావాళ్ళు తిడుతూన్నప్పుడు వాళ్ళ నోటివెంట యెంత చక్కని జాను తెనుగు రేగుతుందని? మొగాలు ఆట్టే అంత బాగుండవని కాని; – నవ్యాంధ్రవాగను శాసనుడు గిరాంమూర్తి అత్మకు... స్వర్గంతో ఇహఁపనేమిటి?–

సాహిత్యాలాపాల కేంగాని, ఎంతచెడ్డా నేనూ ప్రాకృతుణ్ణే....నాకూ ఉక్కురోషం లేదనా? లోపల – లోపల గింజుకోలేదనా? – ఈవిడ కడుపుడకా? – నేను ఈవిడ కడుపున పుట్టాల్సినంత ఏం ఖర్మం?....అవిడ కడపున పడటానికి నోచుకునేంత పాపం చెయ్యడానికి, పరమాత్మకైన ఆ తరంకాదు....నేనో, ఎనభైనాలుగు లక్షల జీవరాసులల్లో ఒక రాశిలో ఒక్క ఏటమ్‌ను – నే నెంత, నా అర్హత ఎంత? – అంతగా, చతుర్దశభువనాల్లో ఉన్న తల్లి – కడుపులన్నీ ఊడ్చి పెట్టుకుపోయి....ఈ ఒక్క కడుపే బావురుమంటూ మిగిలినా, ఆ దెబ్బతో ఆ దయామయుడు ఉక్కిరి బిక్కిరై, చచ్చినట్లు నాకు పునరావృత్తి రహితం చేసెయ్యాలి... ఎల్లాగైనా నేను ఆవిడ మూలాన తరించక తప్పేట్టులేదు...

"అమ్మా....ఆకలే!" అంది వాళ్ళ రుక్మిణి...

"ఉండవే నీ మొగంమండా!" అంది తల్లి గొంతు...

"అత్తయ్యా!" అంది వాళ్ళ కడ–సొరపుకోడలు లలిత.

"ఎందుకే, నీ మొగమీడ్చా!" అంది ఆ వెధవ పీనుగు (యొక్క) అత్తగారు.

....నా ఆలోచనలు వాటి త్రోవను అవి పోతున్నవి – మధ్య మధ్య ఈ సరస – సల్లాపాలు వినబడుతూన్నవి...

ఆవిడచేత తిట్లు తినేవాళ్ళంటే నాకు తగని ప్రాణం...

–"అన్నాయ్...మలే" అంది చెల్లాయ్, పారచాపుకు కుర్చీలో పడుకున్న వాణ్ని ఝుళుల్ న కూర్చున్నాను... బుంగమూతి చేసుకుని..."మలే...మలే" అని గునుస్తూంది చెల్లాయి గుమ్మంలో నిలుచుని...

"మలే, మనం కాఫీ తావొద్దూ" అంది చెల్లాయి...

అవును, త్రాగాలి. యింతవరదాకా ఆ మాటే మరచి పోయినాను, యుద్ధకాండలో పడి వాళ్ళ చెల్లాయి ఈ అన్నాయితో కలిసికాని కాఫీ త్రాగదు.

...సరే, బయలుదేరాను...చెల్లాయి గున గున లోపలికి వెళ్ళి, సిగరెట్ కేసు, నిప్పుల–పెట్టె అందుకుని, పరుగెత్తుకుంటూ నా త్రోవకు అడ్డంగా నిలుచుని..."ఇవిగో" అంటూ ఆశాశపెడుతూ, నన్ను ఆడించింది. దీని కడుపుడకా, పసి పాప వడసొరం జేనెడుందో, లేదో అప్పుడే యెన్ని ఊహలు?

శీతాకాలపు యెండ చురచుర లాడుతూంది...చెల్లాయి కళ్ళు చికిలిస్తూంది.

తొమ్మిదిన్నర అయింది. అయినా హోటలు గుమ్మంలో కొందరు ఆసాములు తాపీగా నిలుచుని, మొగం కడుక్కుంటూ ఖాండ్రిస్తున్నారు...అప్పుడేకాదు, మిట్టమధ్యాహ్నమైనా ఆ హోటలుకు అదే బాధ. పేట మొత్తంమీద కాఫీ బాగుండటమంటూ కూడా, ఆ ఒక్క చోటనే.

"యాక్కులాలా, నేను దాను – ఉమ్మాడు" అంది చెల్లాయి. నేను, ఎక్కినమెట్టు దిగాను...ఇంకో హోటలుకు అంటే, దూరంపోవాలి, సరే పోదాం...చెల్లాయిని ఓ రిక్షా మీద యెక్కిస్తే సరి...

గోడవారను, నీడను వాల్చి ఉంది రిక్షా. చెల్లాయి యకాయకి ఎక్కి కూర్చుంది. క్రిందన్నీ ఉమ్ములు...యెండు నారింజ తొక్కులు...

..."తాత..." అంది చెల్లాయి, రిక్షావాడు, ఏ రాజ్యం యేలపోయినాడో...వాడికోసం పరకాయిస్తున్నాను... అల్లంత దూరంలో ఎండపొడలో పడుకుని ఉన్న ఆ తాతను చూడనే లేదు...

తాత...యెవరో తాత...యెవడో అబ్బి...అలాబడుగైపోయిన తరువాత, అంతకన్న ఎక్కువ భోగట్టా లోకానికి అనవసరం.

...తాత, కొంచెం దగ్గాడు...కొంచెం ఒళ్ళు విరుపుగా మూలిగి "అమ్మా" అనుకుని, మళ్ళా ముడుచుకు పడుకున్నాడు. ముందు పరచిన గుడ్డపీలిక మీద, మన్ను–దుమ్ము తప్ప. ఎర్రని ఏగాణీ లేదు.

వాడి కడుపు ఏడుస్తూఉంది. మొగం కలకలలాడుతూంది.

"ఏం, బాబూ!" అన్నాను. తాతా అని పలుకరించేందుకు మొగం చెల్లక...

"ఏం రా బాబూ!" అన్నాడు, ఆకాశంలోకి.

"ఏం కావాలి?"

"ఏమ్మి వద్దు..."

"వద్దకపోతే యెలా?"

"ఉహూ, నాకు అక్కర లేదంటూంటే..."

"పోనీలే" నేను చిన్నబుచ్చుకున్నాను. అడిగితే అక్కర్లేదనే బిచ్చగాడి హాములుచూస్తే ప్రతి మొగాడికీ వళ్ళు మండుతుంది.

–అడుగు ముందుకు వేశాను, ఆ వెనుక అడుగు చెల్లాయిది. నేను కనిపెట్టలేదుగాని, మా వెనుక అడుగు వాడిది.

నేనో కుర్చీలో కూర్చున్నాను...చెల్లాయి, బల్లమీద బాసెపట్టు పట్టింది...వాడు, యెదర కుర్చీ ముందుకు లాక్కున్నాడు. అందరం ఓ మూల జేరాము.

...వరుసగా త్రేణ్చాము. బిల్లు చెల్లాయ్ లాక్కుని, తాతకు యిచ్చింది...చెయి జాపేందుకు నా కెందుకో ధైర్యం చాలలేదు...

ఒక రూపాయ్ బిల్లుతోబాటు బల్లమీద ఉంచాడు. బల్ల ముందేసుకు కూర్చున్న పిల్లవాడు...పుచ్చుకునేందుకు సందేహించి, నా మొగంకేసి చూశాడు. నేను, తల తిప్పేసుకున్నాను.

...చిల్లర, చెల్లాయ్ జేబులో జారవిడిచాడు. గొంతు సవరించుకుంటూ, ఆ పిచ్చమీసాలు, ఆ చింకిరిగడ్డం, చేత్తో సవరించుకున్నాడు...

"కడుపు నిండినట్టేనా బాబూ" అన్నాడు. యిద్దరం రోడ్డువారను నిలుచున్నాము. చెల్లాయ్ అక్కడనే ఉన్న వేరుశెనక్కాయల గుట్టదగ్గిర జేరి, ఆ రాశివంకా, చొక్కా జేబువంకా చూసుకుంటూంది. నేను, అటూ ఇటూ చూస్తున్నాను, ఎటూ పాలుబోక...

"నా కడుపు నిండితే, నీకడుపు నిండినట్టేగా, నాయనా" అని మళ్ళా పలకరించాడు. నాకు అర్థమయితేనా? నీకేమన్నా అర్థమైందా?

"కడుపు మాడ్చటంకన్న కనికరించడం, మహాపాతకం బాబూ! బీదసాదలను వాళ్ల మానాన వాళ్లను ఉండనీయకుండా, దయా దాక్షిణ్యం అంటూ, కాల్చుకు తింటుంది ఎందుకూ లోకం? – దారిద్ర్యం ఎంతటి ఐశ్వర్యమో వీళ్ళకు ఏం తెలుసును? – అది అందరికీ అబ్బే వరమా?..."

"అడిగితే ఏ అమ్మన్నా పెట్టదా?... యింత లోకంలో ఏ తల్లికన్నా దయరాదా... అని అనుకుంటారు కదూ... నిజమేలే...తల్లులూ ఉన్నారు. దయా ఉంది...తపించిపోయే బిచ్చగాళ్ళ కోటానుకోటిలో, ఒక్క రేనా తరగడేం మరి?... తరగడెందుకంట?–"

–చేతిలో సిగరెట్ కేసు...తనమాటే మరచిపోయినానని, విల–విల లాడింది...ఇద్దరం పొగలు గ్రక్కుతున్నాము.

"...ఎంత హాయిగా ఉంటుందనుకున్నావు...అలిగి మారాం చేస్తూ పడుకుంటే... అమ్మవచ్చి, 'నాయనా, – బాబూ – మాతండ్రి కదూ –' అని బ్రతిమాలుకుంటూంటే, 'ఉహూ–' అంటూ, సాగదీయించుకుంటూ ఉంటే, ఆ కల ఒక్కటీ...అనంతకోటి ఆకళ్ళను మటుమాయం చేసెయ్యదూ, నాతండ్రీ...యిప్పటికి మూడు రోజులనుంచీ అమ్మను వేధించుకు తింటున్నాను."

"అమ్మ ఒఖ్ఖసారన్నా విసుక్కోందే...అమ్మకు లేని ఆకలి, నాకు ఎక్కడనుంచి వస్తుంది బాబూ..."

"అమ్మ, దగ్గిర కూర్చుని, తల నిమురుతూ బుజ్జగిస్తూంది...తల ఒడిలోకి జేర్చుకోబోతూంది...ఇంతలో నీవు లాక్కొచ్చేశావు..."

"పోనీలే...అమ్మా నీ కళ్ళు చల్లబడ్డాయా?"...చెల్లాయ్ తల నిమురుతూంది...ఆ ముసలి చెయ్యి. చెల్లాయ్ వాడి ఒక్కడికోసమే నవ్వింది...

"మా అమ్మ..." అన్నాడు, పసిపిల్లాడిలాగా తాత...తన త్రోవను తాను పోయినాడు...కథలోంచి.

"అన్నాయ్...తాత..." అని ముసి ముసిగా నావంక చూసింది చెల్లాయ్... "ఏడీ?" అంటుందనుకుని, నా గుండె గుభిల్ మంది...

...చెల్లాయ్, వేరుశెనక్కాయలు అక్కరలేదంది. జామపళ్ళు, 'ఎబ్బే' అంది. రిక్షా అన్నా ఎక్కనంది...

...మిలిటరీలారీలు ఎడా – తెరపీ లేకుండా పోతున్నాయి... ఎక్కడివాళ్ళు మక్కడ నిలబడి పోయినాము. తొక్కిసలాటలో ఎవడో ముష్టివాడి చింకిపాతలో నాలుగు గింజలు జారి ఒలికిపోయి మశానంలో కలిసిపోయినాయి...

లారీలు అయిపోయినాయి...ఆ దుమ్ములో కళ్ళు పోయినాయి, అప్పుడు ... హమ్మయ్య, అప్పటికి...వచ్చాయి కళ్ళనీళ్ళు...

–చెల్లాయి నాకన్న ముందుగానే యింట్లోకి పరుగెత్తుతూంది...అవిడ, ఏమూలానుంచో పొలికేక పెడుతూంది.

"...యింత సేపటినుంచీ ఎక్కడ చచ్చావే...దిక్కుమాలినదానా...నీ మొఖ మీ–ద–చా..."

"అమ్మా...మలే..." అంటూంది చెల్లాయ్...

"ఛప్–నోర్ ముయ్–తప్పుడుముండా...వెధవ సావాసాలూ...వెధవ వేషాలూను..." అంటూ ప్రతిధ్వనిస్తూంది అవిడ...

–తలుపు తీసేటప్పటికల్లా, లోగుమ్మంలో, అమ్మదగ్గిర నుంచి వచ్చిన ఉత్తరం నాకోసం ఎంతసేపాయో, పడిగాపులు పడి ఉంది...

"రెండు పూటలూ భోజనం ఏమారకు నాయనా. ఒంటి పూటైతే, కాకచేస్తుంది...నీవు తినకుండా పడుకున్నావనుకుంటే...నాకు యిక్కడ ముద్ద నోటికిపోదు..." ఇంతే విశేషాలు...

–నాకు, ఈపూటే అసలు ఎంతమాత్రమూ ఆకలిగా లేదు......

"అన్నాయ్...అయ్...గోరుగోరు ముద్ద..." అంది మేడమీద కిటికీలో నుంచుని చెల్లాయ్. వాళ్ళ అమ్మ చేతిలో వెండికంచం ఛెంగున అవతలకు గిరవాటువేసి...చెళ్ళున వీపుమీద ఒకటివేసి...రెక్క పుచ్చుకుని క్రిందికి లాగింది. చెల్లాయ్ ఏడుపు వినిపించలేదు...

నాకు...ఆకలి వెయ్యడం లేదంటూంటే నమ్మవేం?

★ ★ ★